సాక్షి అనకాపల్లి

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



అర్జీలు పునరావృతం కారాదు

ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను అధికారులు శ్రద్ధతో పరిష్కరిస్తే పునరావృతం కాకుండా ఉంటాయని కలెక్టర్ అన్నారు. 8లో



పుస్తకావిష్కరణ

విశాఖ సిటీ: ఏయూ కెమిస్ట్రీ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ రచించిన 'కాంప్రహెన్సివ్ అప్రోచ్‌తో ఆర్గానిక్ కెమిస్ట్రీ' పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం తదితర ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి.

న్యూస్‌రీల్

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ తనిఖీ



స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, పలు పార్టీల నాయకులు

తుమ్మపాల: జిల్లా ఎస్పీ కార్యాలయం పక్కనే ఉన్న ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌లో సోమవారం కలెక్టర్ విజయ కృష్ణన్ తనిఖీలు చేశారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా ఆమె ఈవీఎంలను, సీసీ టీవీల ఫుటేజీలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. భద్రతాపరమైన చర్యలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఆర్.వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు లక్ష్మీదేవి, డీటీలు ఎ.రవిబాబు, శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు



అనకాపల్లి ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న జోన్-1 డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

అనకాపల్లి: విజయ దశమిని పురస్కరించుకుని దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ జోన్-1 డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు తెలిపారు. అనకాపల్లి ఆర్టీసీ డిపోను సోమవారం ఆయన సందర్శించారు. గ్యారేజ్, కార్గో, ట్రాఫిక్ సెక్షన్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరం జోన్ నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, తదితర నగరాలకు బస్సులు నడపడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సర్వీసుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేయాలని నిర్ణయించామన్నారు. భవానీ భక్తులు ముందస్తుగా బుక్ చేసుకుంటే అందుబాటు ధరలో అనకాపల్లి డిపో నుంచి బస్సులు సమకూర్చుతామన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డిపో, బస్టాండ్, దుకాణాల సముదాయం ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి ఆయన శుభ్రం చేశారు.

నెలకొల్పిన చోటే నిమజ్జనం



అనకాపల్లిలో ఫైర్ ఇంజన్ నీటితో నిమజ్జనం చేస్తున్న 35 అడుగుల వినాయక విగ్రహం

అనకాపల్లి (కశింకోట): పూడిమడక రోడ్డులోని చిరు బస్టాప్ వద్ద నెలకొల్పిన భారీ 35 అడుగుల వినాయక విగ్రహాన్ని సోమవారం రాత్రి అదే ప్రదేశంలో నిమజ్జనం చేశారు. ఐకానిక్ యూత్ ఆధ్వర్యంలో ఫైర్ ఇంజన్ నీటితో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనకాపల్లిలో ఇలా జరగడం తొలిసారి కావడంతో స్థానికులు ఎక్కువ సంఖ్యలో ఆసక్తిగా తిలకించారు. వంద కిలోల లడ్డూ వేలం వేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోరిబిల్లి ప్రశాంత్, భవిష్యశ్రీ అధినేత కాండ్రేగుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర పోటీల్లో విజేతలకు బహుమతులు



అవార్డు అందుకుంటున్న పాయకరావుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజ విద్యార్థిని పిక్కి దేవని (వక్తృత్వ పోటీలో ద్వితీయ స్థానం)

తుమ్మపాల: విద్యార్థులు ఎల్లప్పుడూ తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, క్రమశిక్షణతో మెలగాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఇటీవల జిల్లాలో అన్ని పాఠశాలలు, కాలేజీల్లో 'స్వర్ణాంధ్ర-2047' అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఉత్తమ ప్రదర్శనిచ్చిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం విద్యార్థులకు సోమవారం కలెక్టరేట్‌లో బహుమతులు ప్రదానం చేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్ విద్యార్థులకు బహుమతులు అందించి వారితో ముచ్చటించారు. కలలు కని వాటిని సాకారం చేసుకునే వారు ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు.

కారిడార్ నిర్వాసితులపై కటాఫ్ కత్తి

చంద్రబాబు సర్కారు కోస్టల్ కారిడార్ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులను మరోసారి మోసం చేసింది. నిర్వాసితుల మెడపై కటాఫ్ డేట్ అనే కత్తి పెట్టి భూములు లాక్కొని కారిడార్ పనులు ప్రారంభించాలని చూస్తోంది. 2014లో ఒకసారి మోసం చేసిందని, ఇప్పుడు తాజాగా మరోసారి రైతులకు అన్యాయం చేయాలని చూస్తోందంటూ అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నమ్మించి మోసం చేసిన టీడీపీ సర్కార్
- 2010 భూసేకరణ నోటిఫికేషన్ ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపునకు యత్నాలు
- చంద్రబాబు మరోసారి నమ్మక ద్రోహం చేస్తున్నారంటూ రైతుల ఆగ్రహం



కోస్టల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములు

నక్కపల్లి: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అమలాపురం, రాజయ్యపేట, వేంపాడు, డీఎల్ పురం, బుచ్చిరాజుపేట గ్రామాల్లో సుమారు 4,500 ఎకరాల భూములు సేకరించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2010లో 4 (1) నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 2500 ఎకరాలు జిరాయితీ, 2000 ఎకరాలు డీఫారం, ప్రభుత్వ భూములు ఉన్నాయి. మొదట్లో ఈ భూసేకరణను వ్యతిరేకించి రైతులు కోర్టుకెళ్లారు. టీడీపీ 2014లో అధికారంలోకి వచ్చాక భూసేకరణను వేగవంతం చేశారు. మీకెందుకు నేనున్నానంటూ చంద్రబాబు కోర్టు కేసులు ఉపసంహరింపజేయించి.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని నమ్మబలకడంతో రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. జిరాయితీ భూములకు ఎకరాకు రూ.18 లక్షల చొప్పున, డీఫారం భూములకు ఎకరాకు రూ.12.60 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించారు. భూముల తోపాటు, ఇళ్లు, పశువుల షెడ్లు కోల్పోయిన వారి కుటుంబాల్లో మేజర్లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం చెల్లిస్తామని, భూములు స్వాధీనం చేసుకున్న రోజుకు నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లుగా ఉన్నవారికి నష్టపరిహారం చెల్లిస్తామంటూ అప్పట్లో చంద్రబాబు సర్కారు హామీ ఇచ్చింది. 2016-19 మధ్యకాలంలో భూసేకరణకు సంబంధించి నష్టపరిహారం చెల్లింపులన్నీ పూర్తిచేసింది. తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో నిర్ణయించిన మేరకు ఇళ్లకు, పెండింగ్‌లో ఉన్న డీఫారం భూములకు నష్టపరిహారం చెల్లించింది. అయితే పరిహారం చెల్లించిన భూములను రైతుల నుంచి ఇంకా స్వాధీనం చేసుకోలేదు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం స్టార్టప్ ఏరియా కింద 1100 ఎకరాలు సిద్ధం చేసింది. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.400 కోట్లు విడుదల చేయడంతో సీసీ రోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా పనులు చేయడానికి నిర్ణయించింది. ఈ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ మళ్లీ ఓటు బ్యాంకు రాజకీయాలను నడిపింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ పనులు అడ్డుకుంది. దీంతో పనులు నిలిచిపోయాయి.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేస్తున్న నిర్వాసితులు, రైతులు

కూటమి ప్రభుత్వ కుట్రకు నిరసన

సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టార్టప్ ఏరియాలో పనులు ప్రారంభానికి చర్యలకు ఉపక్రమించడంతో నిర్వాసితులు, రైతులు అడ్డుకున్నారు. వీరికి వైఎస్సార్‌సీపీ, సీపీఎం అండగా నిలిచాయి. పనులు జరిగే చోట నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. గతంలో చంద్రబాబు సర్కారు హామీ ఇచ్చిన విధంగా 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు రూ.24 లక్షల చొప్పున ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతోపాటు, ఇళ్లు కోల్పోయిన వారికి రూ.15 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని జిరాయితీ భూముల మాదిరిగా డీఫారం భూములు గ్రామకంఠాల్లోను, రస్తాల్లోను ఇళ్లు కోల్పోతున్నవారికి కూడా నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇంతలో కూటమి ప్రభుత్వం పిడుగు లాంటి వార్త చెప్పింది. 2010 భూసేకరణ నాటికి నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు (18 ఏళ్లు నిండినవారికి) మాత్రమే పరిహారం చెల్లిస్తామని ఇటీవల ప్రకటించింది. 18 ఏళ్లు నిండిన మేజర్లను గుర్తించి 735 మందితో అర్హులైన వారి జాబితాలు ఆయా గ్రామ సచివాయాల్లో ప్రదర్శించారు. వీరికి మాత్రమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.8 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. దీన్ని నిర్వాసితులంతా వ్యతిరేకిస్తున్నారు. భూసేకరణ చేసిన 14 ఏళ్ల తర్వాత భూములు స్వాధీనం చేసుకుంటున్నారని, నోటిఫికేషన్ నాటికి 18 ఏళ్లు నిండిన వారికే ప్యాకేజీ ఇస్తామంటే చాలా మంది అన్యాయమవుతారని నిర్వాసితులు వాపోతున్నారు. 2024లో భూములు స్వాధీనం చేసుకుంటున్నారు కాబట్టి ఈ ఏడాదికి 18 ఏళ్లు నిండిన వారందరినీ గుర్తించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను, ఏపీఐఐసీ అధికారులను, రాష్ట్ర మంత్రి అనితను కలిసి వినతిపత్రాలు ఇచ్చామని ఇంతవరకు ఎటువంటి స్పష్టమైన హామీ రాలేదని వారు ఆరోపిస్తున్నారు. భూములు స్వాధీనం చేసుకున్న తేదీనే కటాఫ్ డేట్‌గా పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కదం తొక్కిన నిర్వాసితులు

- కటాఫ్ డేట్ మార్చాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన
- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ఇండస్ట్రియల్ కారిడార్ బాధితుల పట్టు



డీటీకి వినతి పత్రం ఇస్తున్న నిర్వాసితులు

నక్కపల్లి: ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులు సోమవారం కదం తొక్కారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ మార్చాలంటూ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఏపీఐఐసీ సేకరించిన భూములకు సంబంధించి మేజర్లకు ఇచ్చే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో అన్యాయం చేయవద్దని వేంపాడు, చందనాడ, అమలాపురం, పాటిమీద, మూలపర, తమ్మయ్యపేట గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, మహిళలు ఆందోళన చేశారు. వీరికి వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు అండగా ఉంటూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, చందనాడ సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, అమలాపురం ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010లో భూసేకరణకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని నమ్మబలకడంతో రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారన్నారు. అయితే 2010 మార్కెట్ విలువ ప్రకారమే 2016 నుంచి 2019 వరకు నష్ట పరిహారం చెల్లించారన్నారు. డీ ఫారం, ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న రైతులకు పరిహారం చెల్లింపు ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. గ్రామ కంఠాలు, ప్రభుత్వ భూముల్లో ఇళ్లకు కూడా పరిహారం చెల్లించలేదన్నారు. 2010, 11 సంవత్సరాల్లో 18 ఏళ్లు నిండిన వారికి మాత్రమే ప్రస్తుతం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చేందుకు అర్హుల జాబితా సిద్ధం చేశారన్నారు. దీని వల్ల చాలా మందికి అన్యాయం జరుగుతుందన్నారు. ఒకపక్క పరిహారం చెల్లించిన 10 ఏళ్ల తర్వాత భూములు స్వాధీనం చేసుకుంటూ.. మరోపక్క భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేసిన 2010, 11 సంవత్సరాలను కటాఫ్ డేట్‌గా నిర్ణయించి నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం దారుణమన్నారు. 2024 సంవత్సరాన్ని కటాఫ్ డేట్‌గా పరిగణించి ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు పనులు అడ్డుకుంటామన్నారు. అనంతరం డీటీ అన్నాజీరావుకు వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్ ఫొటోతో ఫేక్ వాట్సాప్

అకౌంట్‌కు నగదు వేయాలంటూ మెసేజ్‌లు



కలెక్టర్ ఫొటోతో నగదు కోసం వాట్సాప్ చాట్

తుమ్మపాల: సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాదు ఉన్నత స్థానాల్లో ఉన్న అధికారులనూ వదలట్లేదు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఫొటో ఉన్న ఓ ఫోన్ నంబర్‌తో వివిధ శాఖల జిల్లా అధికారులకు వాట్సాప్ మెసేజ్‌లు వచ్చాయి. 'నేను కలెక్టర్ విజయ కృష్ణన్‌ని.. ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నాను. అర్జెంట్‌గా రూ.50 వేలు కింది తెలిపిన అకౌంట్‌కు పంపించండి. సాయంత్రంలోగా తిరిగి చేస్తా..' అంటూ సౌరభ్ పేరిట ఉన్న అకౌంట్ నెం .606018210007440, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ బీకేఐడీ0007610, పాన్ నెం.ఎస్‌వైటీపీఎస్0546ఏ, ఢిల్లీ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా వివరాలను పంపించారు. నగదు పంపించి, ధ్రువీకరణ కోసం స్క్రీన్‌షాట్ కూడా వాట్సాప్ చేయాల్సిందిగా కోరారు. దీంతో అధికారులకు అనుమానం వచ్చి నేరుగా కలెక్టర్‌ను కలిసి, విషయం తెలిపారు. సైబర్ నేరగాళ్ల పనే అని గుర్తించిన కలెక్టర్ విజయ కృష్ణన్ వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె అధికారిక ఫోన్ నెంబర్ నుంచి వచ్చిన మెసేజ్‌లకు ఎవరూ మోసపోవద్దంటూ వాట్సాప్ స్టేటస్ పెట్టి మరీ అందరినీ ఆమె అలెర్ట్ చేశారు. అధికారులెవరూ మోసపోలేదని కలెక్టర్ మీడియాకు వెల్లడించారు.

నేటి మధ్యాహ్నం అప్పన్న దర్శనాలు బంద్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లభించవని దేవస్థానం ఏఈవో ఆనంద్ కుమార్ తెలిపారు. రానున్న శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయ శుద్ధి(కోయిల్ తిరుమంజన్ సేవ) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు కసరత్తు

- ఉపాధ్యాయులూ.. ఓటు హక్కు నమోదు చేసుకోండి
- కలెక్టర్ హరేందిర ప్రసాద్



ఉపాధ్యాయుల ఓటు నమోదుపై సమీక్షిస్తున్న విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సూచించారు. సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ వెలువడిందని, సోమవారం నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నవంబర్ 6 వరకు కొనసాగుతుందన్నారు. నవంబర్ 23న డ్రాఫ్ట్ పబ్లిష్ అవుతుందని, 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ,డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో 34 ఈఆర్వోలను, 187 మంది ఏఆర్వోలను నియమించామన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు సెకండరీ స్థాయికి మించిన పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 43 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 1941 కేంద్రాలు ఉండగా 1500 ఓటర్లు దాటిన చోట కొత్త వాటిని ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవో లు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్లు సీతారామమూర్తి, శేష శైలజ, లక్ష్మారెడ్డి, తహశీల్దార్లు, ఎలక్షన్ డీటీలు పాల్గొన్నారు.

నాణ్యత 'చిక్కి'ంది...!

- విద్యార్థులకు కాలం చెల్లిన చిక్కీల పంపిణీ
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శల వెల్లువ



ప్రభుత్వ పాఠశాలలో కాలం చెల్లిన చిక్కీ

మునగపాక: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కాలం చెల్లిన చిక్కీలు అందిస్తుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలా నాసిరకం సరుకులు అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడే చర్యల పట్ల అధికారులు నిర్లక్షం చూపుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి వారంలో మూడు రోజుల పాటు చిక్కీలు అందజేస్తారు. సోమవారం, బుధవారం, శుక్రవారం రోజుల్లో విద్యార్థులకు ఒకటి వంతున ఇస్తుంటారు. ఇదే విధంగా సోమవారం మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో అందజేసిన చిక్కీ కవర్‌పై 27-07-2024గా ప్యాకింగ్ చేసినట్టు ముద్రించి ఉంది. అయితే ప్యాకింగ్ చేసిన 60 రోజుల్లోగా చిక్కీలను ఉపయోగించాలంటూ ముద్రణలో పేర్కొన్నారు. కానీ అధికారులు ఇవేమీ పట్టనట్లు కాలం చెల్లిన చిక్కీలను విద్యార్థులకు అందజేయడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ విషయమై ఎంఈవో వేణుగోపాలరావు వివరణ కోరగా కాలం చెల్లిన చిక్కీలు అందజేసిన విషయం తెలిసిందని, ఇకపై అలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం



మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్ (విశాఖ): తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వంటి ఒక అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడాల్సిన తీరు ఇదేనా? అని ప్రశ్నించడంతోపాటు అసలు ఏ ఆధారంతో కల్తీ నెయ్యి వాడినట్లు నిర్ధారణకు వచ్చారని సుప్రీంకోర్టు అడగడం గమనార్హమన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి వంటి వ్యక్తి ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం అనుచితమని కోర్టు పేర్కొందన్నారు. నెయ్యి కల్తీ జరిగినట్టు సాక్ష్యం చూపించాలని సుప్రీం కోర్టు ఆదేశించడంపై మేయర్ హర్షం వ్యక్తం చేశారు.

రక్తదానంపై చైతన్య స్ఫూర్తి

- యువత ఆధ్వర్యంలో 'అమ్మ హెల్పింగ్ హార్ట్స్' సేవలు
- ఇప్పటి వరకు 10 వేల మందికి రక్తదానం
- రేపు వెయ్యి మందితో మెగా రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు



అమ్మ హెల్పింగ్ హార్ట్స్ లోగో



గతంలో జరిగిన రక్తదానంలో పాల్గొన్న యువకులు

బుచ్చెయ్యపేట: ఎవరైనా ఆపదలో ఉన్నారంటే వెంటనే అక్కడ ప్రత్యక్షమై రక్తదానం చేసి ప్రాణాలను కాపాడడంలో వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ యువకులు ముందుంటున్నారు. రక్తదానంపై ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు. సమాజసేవే పరమావధిగా తమ సంస్థ ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే కాకుండా గ్రామీణ ప్రాంత యువతకు అవసరమైన శిక్షణ ఇస్తూ వారిలో నైపుణ్యం పెంపొందించి ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన వారు ఇప్పటి వరకూ 25 మంది ఎస్ఐ, 600 మందికి పైగా కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందగలిగారు.

రక్తదానంలో మేటి...సేవల్లో స్ఫూర్తి

ప్రకృతి వైపరీత్యాలు, కరోనా, స్వైన్ ఫ్లూ వంటి అంటువ్యాధులు ప్రబలినపుడు ఈ సంస్థ సభ్యులు అండగా నిలిచి నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సహాయం, మందులు అందించి ప్రజా మన్ననలను పొందారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణుల ప్రసవాల సమయంలో ఆపరేషన్లు, రక్తహీనతతో బాధపడుతూ రక్తదాతల కోసం ఎదురుచూస్తున్న వారికి సహాయ పడడానికి 2008 అక్టోబర్ 2వ తేదీన ఆవిర్భావించిన ఈ సంస్థ అంచెలంచెలుగా సేవా కార్యక్రమాల్లో ఎదిగి రాష్ట్ర స్థాయిలో మన్ననలు, అవార్డులు అందుకుంది. 2018లో జిల్లా ఉత్తమ ఆర్గనైజేషన్ అవార్డు, 2020లో సావిత్రిబాయి పూలే అచీవ్‌మెంట్ అవార్డు, 2023లో రెడ్ డ్రాప్ అవార్డుతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా అవార్డులు అందుకున్నారు.

2న మెగా రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు

ఈ సంస్థ 2013 నుంచి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయగా, మొదటిసారి 85 మంది యువకులు రక్తదానం చేశారు. అలా ఏటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ ఇప్పటి వరకు సంస్థ ద్వారా 10 వేల మంది రక్తదానం చేశారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున వెయ్యి మంది రక్తదానం చేసేలా మెగా రక్తదాన శిబిరాన్ని వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సినీ, టీవీ కళాకారులు, క్రీడాకారులు, రాజకీయనాయకులు, అభ్యుదయవాదులు మద్దతు ప్రకటించి తాము కూడా రక్తదాన శిబిరంలో పాల్గొంటామని హామీ ఇచ్చి ప్రచారాలు చేశారు. ఈ నెల 2వ తేదీ గాంధీ జయంతి రోజున 1000 యూనిట్లు రక్తం సేకరించడానికి మెగా రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు చేపట్టారు.

రక్తదానం చేస్తా..



ఈనెల 2వ తేదీన నిర్వహించే రక్తదాన శిబిరంలో నేను పాల్గొనడమే కాక నాతో పాటు మా ఊరి నుంచి మరో 20 మంది యువకులను తీసికొచ్చి రక్తదానం విజయవంతం అయ్యేలా కృషి చేస్తాను. అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు మా గ్రామంలో ఉన్న పలువురికి ఆపద సమయంలో ఆసుపత్రికి వచ్చి రక్తదానం చేసి పలువురు ప్రాణాలు కాపాడారు. సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం.

–పాతాళ సత్తిబాబు, యువకుడు, బుచ్చెయ్యపేట

అందరూ సహకరించాలి



ఆపదలో ఉన్న వారికి ఎటువంటి లాభాపేక్ష ఆశించకుండా అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సభ్యులు రక్తదానం చేయడం అభినందనీయం. పలువురు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రిలో ఉండగా వారి వద్దకే వెళ్లి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడడమే కాక ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి వేలాది యూనిట్లు రక్తం సేకరిస్తున్న సంస్థ సభ్యులకు అభినందనలు తెలపడమే కాక అందరూ మంచిపనికి సహకరించాలి. –ఎ.శ్రీనివాసరావు, ఎస్ఐ, బుచ్చెయ్యపేట

క్లుప్తంగా

47 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు



గంజాయి, కారుతోపాటు పట్టుబడ్డ నిందితులు

మాడుగుల రూరల్: మండలంలోని తాటిపర్తి గ్రామ శివారులో ఏజెన్సీ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి. నారాయణరావు సోమవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్ కుమార్, అంకిత్ ఖోకర్ పాడేరులో 47 కిలోలు గంజాయి కొనుగోలు చేశారన్నారు. అక్కడ నుంచి చోడవరం వైపు కారు (ఎం.పి.04 సిఎక్స్ 5801)లో వస్తుండగా, ముందస్తు సమాచారం మేరకు తాటిపర్తి శివారులో తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి గంజాయి, కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తికి ఐదేళ్ల జైలు

మునగపాక: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితునికి 5 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనందిని సోమవారం తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం నాగవరంలో కిరాణా దుకాణం నడుపుతున్న వ్యక్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2019 ఫిబ్రవరి 10న అదే గ్రామానికి చెందిన లారీ క్లీనర్ బండారు రమణ బాలికకు మాయమాటలు చెప్పి డాబా పైకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిత్యం తమ దుకాణానికి వస్తూ పిల్లలతో చనువుగా ఉంటున్న వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టడంతో బాలిక ఏడుస్తూ జరిగిన సంఘటనను తండ్రికి వివరించింది. బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు తగిన ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. నేరం రుజువు కావడంతో నిందితుడు రమణకు 5 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధించారు. పీపీ కరణం కృష్ణ వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేలా దర్యాప్తు నిర్వహించిన అధికారులను ఎస్పీ దీపిక అభినందించారు.

అర్జీలు పునరావృతం కారాదు

- వీటి పరిష్కారంలో జిల్లా ముందంజలో ఉండాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రజలు సమర్పిస్తున్న అర్జీల పట్ల అధికారులు దృష్టి సారించి శ్రద్ధ వహిస్తే పునరావృతం కాకుండా ఉంటాయని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆమెతోపాటు జేసీ ఎం.జాహ్నవి, జిల్లా అధికారులు సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలో అర్జీలను పరిష్కరించినట్లయితే జిల్లా ముందంజలో ఉంటుందన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందుతారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో దయానిధి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, జిల్లా అధికారులు

హిందూ దేవాలయాలపై ప్రభుత్వ అజమాయిషీ తగదు

దేశంలో హిందూ దేవాలయాలపై ప్రభుత్వాల అజమాయిషీ పూర్తిగా తొలగిపోవాలని హిందూ ధార్మిక సంస్థలు, స్వామిజీలకు, భక్తులకు అప్పగించాలంటూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పురోహితులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రం అందించారు. హిందువులకు మాత్రం తమ దేవాలయాలను నిర్వహించుకునే స్వేచ్ఛ లేకపోవడం తీవ్ర అన్యాయమని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, కార్యదర్శి బుద్ధ సీతారాము తెలిపారు. తక్షణమే గవర్నర్ స్పందించి దేవాలయాలపై ప్రభుత్వాల జోక్యాన్ని నియంత్రించాలన్నారు. తిరుమల బోర్డులో అన్యమతస్తుల లేకుండా చూడాలన్నారు.



పురోహితుల నిరసన

మద్యం దుకాణాల సిబ్బంది నిరసన

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. గత నెల 30తో ముగిసిన మద్యం పాలసీని రద్దు చేసి నూతన పాలసీ తేవడంతో తమ ఉద్యోగాలకు భరోసా లేకుండా పోయిందని వాపోయారు. 2019లో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో జీవో నెం.7/2022 ప్రకారం సూపర్‌వైజర్, సేల్స్‌మెన్ కేటగిరీల్లో తమకు జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రతపై ప్రభుత్వానికి అనేక సార్లు వినతులు చేసినప్పటికీ ఎటువంటి లిఖిత పూర్వక హామీ లేకపోవడంతో తామంతా రోడ్డున పడ్డామని వాపోయారు.



ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నిరసన చేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది

జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి



జగనన్న ఇళ్లకు మౌలిక సౌకర్యాలు కల్పించాలంటూ లబ్ధిదారుల నిరసన

గత ప్రభుత్వంలో పేదలకు జగనన్న కాలనీల్లో ఇచ్చిన ఇళ్లకు నీరు, వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలంటూ అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మహిళలు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. కొత్తూరు గ్రామానికి చెందిన మాకు సంపతిపురం రెవెన్యూ అచ్చియ్యపేట వద్ద స్థలాలు మంజూరు చేయడంతో ప్రభుత్వ నిధులతోపాటు అప్పులు చేసి ఇళ్లను పూర్తి చేసుకుని నివాసముంటున్నామన్నారు. వర్షాకాలం కావడంతో భారీగా తుప్పలు పెరిగాయని, పారిశుధ్య లోపం ఏర్పడిందని వాపోయారు. అధికారులు స్పందించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని పీజీఆర్‌ఎస్‌లో విన్నవించుకున్నారు.

వేరొకరి భూమి చూపి రూ.4.50 లక్షలు దోచుకున్నారని ఫిర్యాదు



పురోణితో నగదు దోచుకున్నవారిపై చర్యలకు కలెక్టరేట్ వద్ద బాధితుడి కుటుంబం నిరసన

నర్సీపట్నం మండలం పిప్పల కొత్తపల్లి గ్రామంలో లాలం రాజులమ్మకు చెందిన సర్వే నంబరు 63లో 3.33 ఎకరాల భూమి చూపించి గాలి చినబుల్లిచే పురోణీ పత్రం చేసి రూ.4.50 లక్షలు దోచుకున్నారని మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం గ్రామానికి చెందిన వడ్డాది దేముడు తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశాడు. ఊరూరా పాత సామాన్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాని, తాను రెక్కల కష్టం మీద కూడేసి దాచుకున్న రూ.4.50 లక్షలు మోసం చేసిన కోటవురట్ల మండలం అకషాహెబ్‌పేటకు చెందిన వ్యక్తులను తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరాడు. సదరు భూమి చూపి మోసం చేశారని తెలియడంతో నేను ఇచ్చిన నగదు ఇవ్వాలని పలుమార్లుగా కోరగా, దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయాడు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సుబ్బయ్య

దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ విజయకృష్ణన్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాలలో చేరిస్తే దాని పరిణామం దళిత హిందూ సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మతం మార్చుకున్న క్రైస్తవులకు రిజర్వేషన్ల సౌకర్యం కల్పించడానికి వీలులేదని అనేక సందర్భాలలో ఉన్నత న్యాయస్థానాలు స్పష్టంగా తీర్పులు ఇచ్చాయన్నారు. మతం మార్చుకున్న వారిని ఎస్సీ కుల జాబితా నుండి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోని గణేష్, నాయకులు చిన ఈశ్వరరావు, పోతురాజు, నర్సింహ చార్యులు, పొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూమిలోకి దారి అడ్డగించడంపై ఫిర్యాదు



ప్రసాదుల సత్యనారాయణ

పూర్వకాలంగా ఉన్న రివాజు దారిని యధావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని నక్కపల్లి మండలం సీతపాలెం గ్రామానికి చెందిన ప్రసాదుల సత్యనారాయణ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. గ్రామంలో పోలవరం ఎడమ కాలువ యూనిట్-2 ఆనుకుని భూమి ఉన్న రైతుల రాకపోకలకు పోలవరం కాలువలో పూర్తిగా భూమి పోయిన ఒక రైతు ఇబ్బందులు పెడుతున్నాడని, సాగు చేసుకున్న పంటలను బయటకు తరలించే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

ఎస్పీ కార్యాలయానికి 40 ఫిర్యాదులు



ఫిర్యాదులు పరిశీలిస్తున్న అదనపు ఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు

అనకాపల్లి(కశింకోట): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. సుమారు 40 ఫిర్యాదులు వచ్చాయి. ఆస్తి, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర వ్యవహారాలపై ఫిర్యాదులు అందాయి. వీటిని జిల్లా అదనపు ఎస్పీలు ఎం. దేవప్రసాద్, ఎల్. మోహన్‌రావు క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్ఐ డి. వెంకన్న పాల్గొన్నారు.

వీరనారాయణంలో ఇసుక ట్రాక్టరు పట్టివేత



మాడుగుల పోలీసు స్టేషన్ వద్ద ఇసుక ట్రాక్టరు

మాడుగుల రూరల్: మండలంలో వీరనారాయణం పెద్దేరు నదిలో ఇసుక ట్రాక్టరును సోమవారం ఉదయం పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వీరనారాయణం గ్రామానికి చెందిన తూరుబిల్లి ప్రసాద్‌కు చెందిన ఇసుక ట్రాక్టరు లోడ్‌తో పెద్దేరు నది నుంచి రావడంతో పట్టుకున్నారు. నది సమీపంలో 15 మంది కల్లంపాకలు వారు ఉన్నారని, మట్టి రోడ్డు పూర్తిగా పాడవుతుందని, ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయాలని అదే గ్రామానికి చెందిన ఆర్లె సాయికిరణ్ అనే రైతు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఫిర్యాదు చేశానన్న అక్కసుతో తనపై ట్రాక్టరు యజమాని ప్రసాదు దౌర్జన్యం చేశాడని మరొక ఫిర్యాదు చేశాడు. మాలధారణలో ఉన్నానని చూడకుండా మాల తెంపివేశాడని అందులో పేర్కొన్నాడు.

కేకే లైన్‌లో మరో 12 కి.మీ డబ్లింగ్ పనులు పూర్తి



డబ్లింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ బ్రజేష్ కుమార్ మిశ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ మరో మైలురాయిని చేరుకుంది. గోరాపూర్-దార్లిపుట్ సెక్షన్‌లో 12.649 కిలోమీటర్ల డబ్లింగ్ పనులను పూర్తిచేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. నూతనంగా ఏర్పాటుచేసిన రెండో లైన్‌ను కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ(సౌత్ ఈస్టర్న్ సర్కిల్) బ్రజేష్ కుమార్ మిశ్రా సోమవారం వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. గోరాపూర్-దార్లిపుట్ సెక్షన్‌లో నూతనంగా నిర్మించిన 2 ప్రధాన వంతెనలు, 28 చిన్న వంతెనలు, రైల్వే స్టేషన్స్, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి ప్రాంతాలను పరిశీలించి అన్ని భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. సీఆర్ఎస్ సంతృప్తిని వ్యక్తం చేస్తూ ధ్రువీకరించారు. అనంతరం ఈ లైన్‌లో స్పీడ్ ట్రయల్‌ను కూడా నిర్వహించారు. మొత్తం 12.649 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులు పూర్తి చేసిన ఈ సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో 2 కిలోమీటర్లు, ఒడిశాలో మిగిలిన భాగం ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కేకే లైన్‌లో పూర్తయిన డబ్లింగ్ పనులతో వాల్తేర్ డివిజన్ మరింత వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఈ తనిఖీలలో వాల్తేర్ డివిజన్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(కన్‌స్ట్రక్షన్) డి.శ్రీనివాసరావు, ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ అశోక్‌కుమార్, చీఫ్ సిగ్నలింగ్ ఇంజినీర్ డి.కె.మల్లిక్, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి జెడ్పీ హైస్కూల్ టీచర్‌కు షోకాజ్


తిరస్కరించిన ఉపాధ్యాయిని

యలమంచిలి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూలు ప్లస్-2లో ఇంగ్లిష్ పీజీటీగా పనిచేస్తున్న చింతల రాధారాణికి డీఈవో ఎం వెంకటలక్ష్మమ్మ షోకాజ్ నోటీస్ జారీ చేశారని ప్రధానోపాధ్యాయిని వీవీ హిమబిందు సోమవారం తెలిపారు. ఇటీవల ఇంగ్లిష్ టీచర్ రాధారాణి తీరుకు నిరసనగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళనకు దిగిన విషయం విదితమే. ఈ మేరకు సదరు టీచర్ పరిమితికి మించి సెలవులు పెట్టడం, విధులకు ఆలస్యంగా రావడం, గతంలో పనిచేసిన స్కూళ్లలో పనితీరు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తదితర అంశాలకు సంబంధించి యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, జంపపాలెం హెచ్ఎం శాస్త్రి విచారణ చేసి డీఈవోకు నివేదించారు. ఈ మేరకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. దీన్ని తిరస్కరిస్తున్నట్టు హెచ్ఎంకు ఇచ్చిన ఆఫీస్ కాపీలో ఇంగ్లిష్ టీచర్ రాసిచ్చినట్టు యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి తెలిపారు. సదరు టీచర్‌పై వచ్చిన ఆరోపణలపై తగు వివరణ ఇవ్వాలని నోటీసులో డీఈవో ఆదేశించినట్టు హెచ్ఎం తెలిపారు.

రైవాడకు కొనసాగుతున్న వరద నీటి ఉధృతి

స్పిల్‌వే ద్వారా 800 క్యూసెక్కుల నీటి విడుదల

దేవరాపల్లి: రైవాడ జలాశయంలోకి వరదనీటి ఉధృతి కొనసాగుతుంది. ప్రస్తుతం జలాశయంలోకి 1000 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. జలాశయం 7వ నెంబర్ స్పిల్‌వే గేటు ద్వారా 800 క్యూసెక్కుల వరద నీటిని శారదానదిలో విడుదల చేస్తున్నారు. కాగా ఆదివారం మధ్యాహ్నం వరకు 1500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో రెండు గేట్ల ద్వారా వరద నీటిని విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు సాయంత్రానికి 1000కి తగ్గడంతో ఒక గేటును మూసేశారు. కేవలం 7వ నంబర్ గేట్లు ద్వారా 800 క్యూసెక్కుల నీటిని శారదానదిలోకి విడుదలను కొనసాగిస్తున్నారు. రైవాడ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.50 మీటర్లకు చేరుకుంది. తదుపరి జలాశయంలోకి వచ్చే వరదనీటి ఆధారంగా నీటి విడుదల తగ్గించడం లేదా పెంచే నిర్ణయాన్ని తీసుకుంటామని ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. శారదానది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



రైవాడ జలాశయం స్పిల్వే గేటు నుంచి విడుదలవుతున్న వరదనీరు

గోవు మృతిపై ఐదుగురు సస్పెన్షన్



పశు సంరక్షణ కేంద్రంలో ఆవు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

ఆరిలోవ: జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రంలో ఓ ఆవు మృతి చెందిన సంఘటనలో ఐదుగురు వైద్య ఆరోగ్య సిబ్బందిని సస్పెండ్ చేశారు. వివరాలు ఇలా..జీవీఎంసీ 20వ వార్డు పరిధి పోలమాంబ ఆలయ ప్రాంతంలో పిన్నింటి మోహనరావుకు చెందిన చూడితో ఉన్న ఆవు ఈనెల 26న రోడ్డు డివైడర్‌పై ఉన్న మొక్కలు మేస్తుండగా పశు సంరక్షణ కేంద్రం సిబ్బంది పట్టుకొన్నారు. దీన్ని 13వ వార్డు పరిధి దీన్‌దయాల్‌పురంలో ఉన్న జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అప్పటి నుంచి సంరక్షణలో ఉన్న ఆవు ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకొన్న ఆవు యజమాని మోహనరావు, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌తో కలిసి సోమవారం కేంద్రానికి చేరుకొని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తన ఆవు మృతి చెందిందని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జోన్-2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ కేంద్రానికి చేరుకొని మృతి చెందిన ఆవును పరిశీలించారు. నిర్లక్ష్యం వహించిన ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. పశువులను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని, పాడి ఆవులను, చూడితో ఉన్న ఆవులను రోడ్లపై విడిచిపెట్టవద్దని ఆవు యజమానికి సూచించారు.

ఇంటికి చేరిన కానిస్టేబుల్

పీఎంపాలెం: మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ అదృశ్యమైన కానిస్టేబుల్ ఇంటికి చేరాడు. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు..ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కనకల వెంకట నరసింహ మూర్తి గత నెల 22వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య కోమలి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలావుండగా అదృశ్యమైన కానిస్టేబుల్ వెంకటనరసింహ మూర్తి తనకు తానుగా ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. పని ఒత్తిడి కారణంగా మానసిక ప్రశాంతత కోసం తిరుమలకు, అక్కడనుంచి విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నాడని, అంతేతప్ప మరే ఇతర కారణాలు లేవని రాతపూర్వకంగా తెలియజేశాడని సీఐ బాలకృష్ణ చెప్పారు.

పోలీసులపై బీచ్ వ్యాపారుల దాడి

బీచ్‌రోడ్డు: పోలీసులపై బీచ్ వ్యాపారులు దాడికి పాల్పడ్డారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..అల్లూరి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఎస్.కె.రహీం, నగరానికి చెందిన హోంగార్డులు అనిల్, నూకరాజు ఆదివారం బీచ్‌కు వెళ్లారు. అక్కడ ఐస్ క్రీం కొనుగోలు చేశారు. నగదు చెల్లింపు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో చుట్టపక్కల ఉన్న బీచ్ వ్యాపారులు చేరుకుని వీరి ముగ్గురిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోలీసులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సోమవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

'కార్మికులను తొలగిస్తే ఊరుకునేది లేదు'



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ (విశాఖ): స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ఊరుకునేదిలేదని ఇంటక్ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్ హెచ్చరించారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో కలిసి సోమవారం స్టీల్ బీసీ గేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే సహించేది లేదని వారిలో తమ విలువైన భూములను ప్లాంట్ కోసం త్యాగం చేసిన నిర్వాసితులు ఉన్నారని, వారి ఉపాధికి గండికొట్టేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని ధ్వజమెత్తారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమండ్ చేశారు. అనంతరం స్టీల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పులి రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, కొవిరి అవతారం, నమ్మి రమణ, దొమ్మేటి అప్పారావు, పితాని భాస్కరరావు, వంశీ కృష్ణ యాదవ్, రమణమూర్తి, మద్ది అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ -కిరండూల్‌కు అదనపు కోచ్‌లు

ఈ నెల 3 నుంచి అందుబాటులోకి..

తాటిచెట్లపాలెం(విశాఖ) : ఈ సీజన్‌లో అరకు అందాలను వీక్షించే పర్యాటకులు, ప్రయాణికుల సౌకర్యార్థం, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితాను క్లియర్ చేసేందుకు కిరండూల్ రైళ్లకు ఆయా తేదీలలో, వారాంతపు రోజుల్లో అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 3,5,7,9,11,13,15,17,19వ తేదీలలో విశాఖలో బయల్దేరే విశాఖ -కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 4,6,8,10,12,14,16, 18,20వ తేదీలలో కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్-విశాఖ(08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు. ఈ నెల 2,4,6,8,10,12,14,16,18,20వ తేదీలలో విశాఖలో బయల్దేరే విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 3,5,7,9,11,13,15,17,19,21వ తేదీలలో కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్-విశాఖ(08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు. ప్రయాణికుల ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని వాల్తేర్ డివిజన్ అధికారులు సూచించారు.

'కైజెన్'లో గంగవరం పోర్టుకు ప్రథమ బహుమతి



గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులకు బహుమతి

పెదగంట్యాడ(విశాఖ): సీఐఐ సదరన్ రీజియన్ కైజెన్ పోటీలలో గంగవరం పోర్టుకు ప్రథమ బహుమతి లభించింది. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ కంటిన్యూస్ ఇంప్రూవ్‌మెంట్ (కైజెన్) నిర్వహించిన పోటీలలో దక్షిణ ప్రాంతం నుంచి అదానీ గంగవరం పోర్టు ప్రతిభ కనబరించింది. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ కైజెన్ పోటీలలో ప్రథమ స్థానాన్ని సాధించడం పోర్టు పనితీరుకు నిదర్శనమన్నారు. ఉద్యోగుల కృషి కారణంగా లభించిన గౌరవమని, ఇది సంస్థకు ఎంతో గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింతగా సేవలందిస్తామని ప్రకటించారు.

ఏయూలో ల్యాబ్ ప్రారంభం



అనలిటికల్ కెమిస్ట్రీ లేబొరేటరీని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలో దివీస్ లేబొరేటరీ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.28 లక్షలతో ఆధునికీకరించిన అనలిటికల్ కెమిస్ట్రీ లేబొరేటరీని సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, దివీస్ ల్యాబొరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.వి.రమణతో కలిసి ప్రారంభించారు. ల్యాబ్‌లో ఆధునిక పరికరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ల్యాబ్‌ను ఆధునికీకరించి అందించిన దివీస్ యాజమాన్యాన్ని వీసీ ప్రశంసించారు. భవిష్యత్తులో ఇదే విధంగా సహకారం, తోడ్పాటును అందించాలని కోరారు. ఏయూ త్వరలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ సేవలను ప్రారంభించనుందని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ దివీస్ ల్యాబ్‌లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్, బీవోఎస్ చైర్మన్ ఆచార్య కె.బసవయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

తుమ్మపాల: నియోజకవర్గ స్థాయి అండర్–14, 17 ఆటల పోటీల్లో ఏఎంఏఎ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయులు మణికుమారి, శివ సోమవారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులను పాఠశాల అధ్యక్షుడు, కరస్పాండెంట్ కర్నాటకపు నారాయణరావు, కొణతాల శివకుమార్, వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొణతాల లక్ష్మీనారాయణ, తమ్మన రఘుబాబు అభినందించారు.

రేపటి నుంచి ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ తరగతులు

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూలులో ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్పందించే హృదయం సంస్థ ప్రతినిధి ఆచంట నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో దసరా సెలవుల్లో రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఫోన్ నంబరు 9296358722ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు కశింకోట విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఆచంట రవి, పీడీ వి. ప్రభాకరరావు సోమవారం తెలిపారు. పాడేరులో జరిగిన జిల్లా స్థాయి స్కూలు గేమ్స్ అండర్– 17 విభాగంలో బి. రోహిత్, కె. అఖిల్ బంగారు, జె. రాంచరణ్, సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరి రజత పతకాలు సాధించారన్నారు. వీరిలో బంగారు పతకాలు సాధించిన వారు త్వరలో విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు ఎస్.జె.వి. ప్రసాద్, సూర్యప్రభ, వరలక్ష్మి, పి.ఎం. అప్పారావు, తదితరులు అభినందించారు.

రేపు ఉత్తరాంధ్ర మెగా శాకాహార సద్భావన ర్యాలీ

అనకాపల్లి (కశింకోట): జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని ఉత్తరాంధ్ర పిరమిడ్ మాస్టర్స్, అనకాపల్లి పీఎస్ఎస్ఎం మాస్టర్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు అనకాపల్లిలో ఉత్తరాంధ్ర మెగా శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుద్ధ ప్రకాష్, రాపేటి బాల సరస్వతి, ఎస్. బద్రి సోమవారం తెలిపారు. అనకాపల్లి గౌరీ సంఘం పార్కు సెంటర్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వినాయక నిమజ్జనోత్సవం



కశింకోట: స్థానిక దుర్గమాంబ ముఖద్వారం, రెల్లి కాలనీల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకుల నృత్యాలతో బాణసంచా కాలుస్తూ ట్రాక్టర్‌పై ఊరేగించి శారదానదిలో నిమజ్జనం చేశారు.

స్టీల్ ప్లాంట్ కార్మికుల తొలగింపు దారుణం

అనకాపల్లి (కశింకోట): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించి బయటకు పొమ్మనడం దారుణమని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతారని కూటమికి ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన పాపానికి వెన్నుపోటు పొడవడం శోచనీయమన్నారు.

వర్షాకాలం.. వ్యాధుల గాలం



అక్కిరెడ్డిపాలెంలో పశువుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

- జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు

నియోజకవర్గంలో పశువుల సంఖ్య	
గేదెలు	13 వేలు
ఆవులు	8 వేలు
గొర్రెలు	3,546



మూలపేట పంచాయతీలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

అనకాపల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. ఈ కాలంలో ముందస్తు జాగ్రత్త చర్యలు కీలకం ... రైతులకు ఆదాయాన్ని సమకూర్చే పాడి పశువులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లయితే, అవి వ్యాధుల బారిన పడకుండా మంచి ఆదాయాన్ని పొందవచ్చు. వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతాయి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ముప్పు తప్పదు. సీజనల్‌గా వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినప్పటికీ పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పశువు కదలికలను గుర్తించకుంటే ఒక్కొక్క సారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావచ్చు. వర్షాకాలంలో పాడిరైతులతో పాటు గొర్రెలు, మేకల పెంపకం దారుల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు చెబుతున్నారు. జీవాలు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

గాలి కుంటు వ్యాధి ఆవులు, ఎద్దులకు ఎక్కువగా సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల వరకూ పెరుగుతుంది. పశువు నోట్లో గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసంగా మారి నడిచేందుకు కూడా ఇబ్బంది పడుతుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, గొంతువాపు మందులను వాడాలి.

నట్టల వ్యాధి...

వర్షాకాలంలో పశువులు పచ్చిమేత తిన్నప్పుడు నులిపురుగులు సమస్య వస్తుంది. ఎక్కువ గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. నట్టల వ్యాధితో జీవాల ఎదుగుదల సక్రమంగా ఉండదు. జీవాలు తిన్న ఆహారమంతా నులిపురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల బారిన పడే అవకాశం ఉంటుంది. ముందులు జాగ్రత్తగా నట్టల నివారణకు తీసుకోవాలి.

కలుషిత తాగునీటితో వ్యాధులు...

పశువులు, మురుగునీరు, కాలువల్లోని కలుషిత నీరు తాగడంతో పశువులకు ఎక్కువగా జలగ వ్యాధి సోకుతుంది. ప్రధానంగా దూడలు, గొర్రెలు, మేకలు తదితర జీవాలకు వస్తుంది. ఈ వ్యాధికి గురైనప్పుడు మేత తినడానికి పశువులు బాగా ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గిపోతుంది. జలగ వ్యాధి సోకిన పశువును పశువుల మంద నుంచి తొలగించాలి. వ్యాధి నివారణకు డిప్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీలీటర్ల నియోజడ్ ప్లస్‌ను వాడాలి.

గొంతువాపు వ్యాధి ప్రాణాంతకం...

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు ప్రాణాంతకం. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి చొంగ వస్తుంది. శ్వాస పీల్చడానికి చాలా ఇబ్బందులు పడతాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతువాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి వ్యాప్తి చెందకుండా పశువులను మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి నియంత్రణకు హెచ్‌ఎస్ టీకాలు వేయించాలి.

వ్యాధులపై రైతులు దృష్టి పెట్టాలి



వర్షాకాలంలో పశువులు వ్యాధిన బారినపడే అవకాశాలు ఉన్నాయి. అనారోగ్యానికి గురైన పశువులకు సకాలంలో చికిత్స అందించినట్లయితే ఆరోగ్యంగా జీవించి పాల దిగుబడినిఇస్తాయి. పశువుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. లేదా దగ్గరలో పశువైద్యాధికారిని తప్పనిసరిగా సంప్రదించాలి. ప్రభుత్వం ఉచితంగా పశువులకు టీకాలు అందజేస్తోంది.

– అనిల్‌కుమార్, పశువైద్యాధికారి, అనకాపల్లి మండలం

పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు

వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశంలో మలసాల భరత్‌కుమార్



ఆత్మీయ సమావేశంలో భరత్‌కుమార్, కె.ఎం.నాయుడును సత్కరిస్తున్న నాయకులు

తుమ్మపాల: రానున్న ఐదేళ్లు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 80వ వార్డులో పార్టీ ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ 2014లో ఒక సామాన్య కార్యకర్తగా మొదలై వార్డు ఇన్‌చార్జిగా పార్టీ కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న కె.ఎం.నాయుడు ఆదర్శంగా అందరు పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు విలువ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ గత ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ కార్యకర్తల్లో ఎటువంటి నిరాశ లేదనడానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన ఈ ఆత్మీయ సమావేశమే నిదర్శనమన్నారు. కార్యకర్తల పట్టుదలతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా తాను మరింత ఉత్సాహంతో పనిచేస్తామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, అధికారం లేనంత మాత్రాన ప్రజలకు సేవ చేయలేమనుకోవడం పొరపాటన్నారు. తాను సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, ఇప్పటికే కొంతమందికి తన కంపెనీలో ఉపాధి కల్పించానని, రాబోయే రోజుల్లో మరింత మంది యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. అవకాశం ఉన్నంత వరకు మన ప్రాంతంలోనే కంపెనీని ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు భరత్‌కుమార్, కె.ఎం.నాయుడును దుశ్శాలువాలు, గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, పార్టీ నాయకులు విల్లూరి వీరసంతోష్ కుమార్, పిళ్లా రాజు, జిల్లా కార్యదర్శి శీలం నదియా, కాంగ్రేగుల హైమావతి, గొల్లవిల్లి నరసింహారావు, బుద్ధ నరసింహారాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అన్నపూర్ణ బ్యాంక్ అభివృద్ధి



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి సత్యకుమార్

తుమ్మపాల: అందరి సహకారంతో తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (అన్నపూర్ణ బ్యాంకు) అభివృద్ధి చెందుతుందని అసిస్టెంట్ రిజిస్టర్, అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి వి.వి.వి. సత్యకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక బ్యాంకులో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో రుణాలు చెల్లించిన సభ్యులు ఎవరైనా చనిపోతే, వారికి గతంలో దహన ఖర్చుల నిమిత్తం ఇస్తున్న రూ.5 వేలను సభ్యుల కోరిక మేరకు రూ.6 వేలకు పెంచినట్లు తెలిపారు. సంఘ సీఈవో బడ్జెట్ చదవగా సభ్యులు విని ఆమోదించారు. ప్రతి సంవత్సరం సభ్యులకు కావలసిన ఎరువులు సకాలంలో అందించడం జరుగుతుందన్నారు. ఈ మహాజన సభలో సభ్యులు పిలా బుజ్జి, పీల జగ్గా సత్యనారాయణ, బొడ్డపాటి చినరాజారావు, దొడ్డి సత్య అప్పారావు, కోరుబిల్లి శంకరరావు, వెలగా భాస్కర్ నర్సింగరావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలపై సత్యాగ్రహ దీక్ష

ఏడీ రమాజ్యోతికి యూటీఎఫ్ నోటీస్ అందజేత



సత్యాగ్రహ దీక్ష నోటీసును ఏడీకి అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తుమ్మపాల: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 2న చేపట్టే సత్యాగ్రహ దీక్షకు సంబంధించి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయంలో ఏడీ రమాజ్యోతికి నోటీస్ అందించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు విద్యా శాఖ పరిధిలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. వీటి పరిష్కారానికి యూటీఎఫ్ చేపట్టిన పోరాట కార్యాచరణను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న హెడ్ మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి. శ్రీలక్ష్మి, మున్సిపల్ సంఘ నాయకులు మాకిరెడ్డి రాజునాయుడు, బాషా, నాతవరపు సతీష్, జిల్లా నాయకులు జోగా రాజేష్, దేముడు నాయుడు, మామిడి బాబూరావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల ధర్నా

పర్మినెంట్ చేయాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు

తుమ్మపాల: తమను పర్మినెంట్ చేయాలంటూ ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆందోళన చేశారు. ఈ మేరకు పట్టణంలో సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్డీవో ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. శంకరరావు, జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ తక్కువ జీతాలు ఇవ్వడం దారుణమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా ఉన్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందని, ఎక్కడా అమలు చేయడం లేదని వాపోయారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దు చేసి, లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, ఇందులో భాగంగా ఫిక్సిడ్ టర్మ్ కార్మికులుగా చేయాలని చూస్తుందన్నారు. యజమానికి కార్మికుడికి మధ్య సంబంధం లేకుండా గంటల పనితోనే వేతనాలు ఇవ్వాలని తీసుకొచ్చారని, ఇది దుర్మార్గమైన చట్టమని ఆరోపించారు. ఇటువంటి చట్టాలకు వ్యతిరేకంగా అందరం ఐక్యంగా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నిమ్మకాయల అజయ్, నూకరాజు, గాంధీ, సంతోష్, రాము, అమ్మాజీ, శ్రీను, భారతి, చిన్ని, అద్దె బస్సు వర్కర్స్, యూనియన్ నాయకులు నాగఅప్పారావు నాయుడు, శివ, డి.శ్రీనివాసరావు, మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు, క్యాబ్ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

కశింకోట తహసీల్దార్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు



తహసీల్దార్ శ్రీనివాసరావును అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కశింకోట: స్థానిక తహసీల్దార్‌గా అడబాల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖ జిల్లా నుంచి ఆయన ఇక్కడకు వచ్చి చేరారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన జి. సత్యనారాయణ పాయకరావుపేటకు బదిలీ అయిన సంగతి తెలిసిందే. కొత్తగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

కశింకోట: ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలను తగ్గించడం పట్ల ప్రభుత్వం దృష్టి నిలపాలని ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు కోరారు. వంద రోజుల పాలన ముగిసిందని, ధరల నియంత్రణ గాలికి వదిలేశారని విమర్శించారు. నూనె ధరలు పెరిగినా కనీసం తగ్గించడానికి ప్రయత్నం చేయడం లేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.

కాశీ విశ్వేశ్వర ఆలయ ఈవోగా మురళీకృష్ణ



అనకాపల్లి(తుమ్మపాల): పట్టణంలోని వేల్పులవీధి కాశీ విశ్వేశ్వర దేవాలయం ఈవోగా బి.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ ఈవోగా పనిచేస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈవో కీర్తి శ్రీనివాసరావు విశాఖపట్నం జిల్లా అక్కయ్యపాలెం గణపతి దేవాలయానికి బదిలీపై వెళ్లారు.

బూడికి పార్టీ నాయకుల శుభాకాంక్షలు



బూడికి శుభాకాంక్షలు చెబుతున్న భరత్‌కుమార్, దిలీప్‌కుమార్, పార్టీ నాయకులు

తుమ్మపాల: నూతనంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని నియోజకవర్గ సమన్వయకర మలసాల భరత్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ నాయకులు ఆదివారం రాత్రి దేవరాపల్లి మండలం తారువ గ్రామంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాలతో సత్కరించారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. బూడిని కలిసిన వారిలో ఎంపీపీ గొర్లె సూరిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు మలసాల కిషోర్, పెద్దిశెట్టి గోవింద్, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కశింకోట వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాస్, యువ నాయకులు మలసాల కుమార్ రాజా, కోఆప్షన్ బి.అప్పలరాజు ఉన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులు ధనుంజయరావు, గుమ్మడి రత్నకుమారిలను సన్మానిస్తున్న దృశ్యం

కశింకోట: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో తాళ్లపాలెం గాయత్రి స్కూలుకు చెందిన ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన కార్యక్రమంలో గాయత్రి స్కూలుకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు ఎం.ధనుంజయరావు, గుమ్మడి రత్నకుమారిలను సత్కరించారు. ఆర్జేడీ బి.విజయభాస్కర్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అసోసియేషన్ చీఫ్ ఎ. కృష్ణారెడ్డి తదితరులు సత్కరించారని స్కూలు కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

కశింకోట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండటానికి పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి పౌష్టికాహార వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాశన నిర్వహించి ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, సూపర్ వైజర్ ఝాన్సీ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు



బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థి

తుమ్మపాల: ఈనెల 28 నుంచి ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో చివరి రోజు సోమవారం నిర్వహించిన పోటీల్లో అనకాపల్లి, కశింకోట మండలాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు అండర్–14, 17 బాలబాలికల విభాగాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. వీరు ఉమ్మడి జిల్లాలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని క్రీడా పోటీల కార్యదర్శి పి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.ఎం.నాయుడు, ఎస్.వి.నరసింహం, లెక్కల రమణ, పి.కమల, వీరు నాయుడు తెలిపారు.

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలుకు చెందిన విద్యార్థినులు వివిధ పోటీల్లో జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారని పీడీ పెంటకోట కమల సోమవారం తెలిపారు. అనకాపల్లిలో నియోజకవర్గ స్థాయి స్కూలు గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు. అండర్– 17 విభాగం వాలీబాల్‌లో ఎం. సుస్మిత, డి. జాహ్నవి, పి. గాయత్రి, అండర్–14లో వి.వేదిక, ఆర్. పుష్ప, ఎస్. లక్ష్మి, అండర్– 17 కబడ్డీలో ఓ. అంజలి, పి.వాసంతి, డి. భవాని, డి. కావ్య, అండర్– 14లో ఆర్. పుష్ప, ఓ. శిరీష, ఎన్. లావణ్య, అండర్– 17 ఖోఖోలో ఎస్.పరిమల, అండర్– 14లో కె. భానుమంతి, టి.ఊర్మిల, వై.పూజిత ఎంపికయ్యారన్నారు. అండర్– 14 విభాగం రన్నింగ్‌లో కె. భానుమతి(100 మీటర్లు), ఎన్. కావ్య (400 మీటర్లు), అండర్– 17లో బి.సంధ్య (200 మీటర్లు), డి. ఉమ (400 మీటర్లు), బి. సంధ్య (వంద మీటర్లు), హైజంప్‌లో ఎం. గ్రీష్మ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని స్కూలులో హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, స్కూలు కమిటీ చైర్మన్ అల్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జిల్లా స్థాయి పోటీల్లో గెలుస్తా



చిన్నప్పటి నుంచి రన్నింగ్ అంటే ఎంతో ఇష్టం. మండల స్థాయి స్కూల్ గేమ్ రన్నింగ్‌లో గెలిచాను. నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందాను. జిల్లా స్థాయి పోటీల్లో గెలుస్తానని నమ్మకం ఉంది. క్రీడా కోటాలో పోలీస్ జాబ్ సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

– బండారు సంధ్య, పదో తరగతి, జెడ్పీ హైస్కూల్, కశింకోట

యోగా టీచర్ అవుతా



యోగా అంటే ఇష్టం. పెద్దయ్యాక యోగా టీచర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉంది. మొదటిసారిగా స్కూల్ గేమ్స్ ఆడుతున్నాను. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. గతంలో ఐదారు తరగతులు చదివినప్పుడు బాయ్స్ స్కూల్లో రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించాను. మా అమ్మ కరుణ కుమారి ప్రోత్సాహంతో యోగా టీచర్ అవ్వాలని ఉంది.

– జోగి ఇంద్రజ, వేల్పులవీధి, జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్, అనకాపలి

ఈవోగా సత్యనారాయణమూర్తి బాధ్యతలు



కశింకోట: స్థానిక సత్యనారాయణస్వామి ఆలయం (కొత్తూరు) ఈవోగా ఎస్.వి.వి. సత్యనారాయణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చోడవరం వినాయక స్వామి ఆలయం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. కశింకోటలోని వేణుగోపాలస్వామి, సీతారామచంద్రమూర్తిస్వామి ఆలయాలకు కూడా ఆయన ఈవోగా వ్యవహరిస్తారు.